# ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్

EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 203 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 +https:www.prajarepublic.com + వెల - 1/-

బుధవారం 17 ఫిబ్రవరి 2025

RNI No: APTEL/2023/87888

Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


## 'కుంభమేళాలో అసౌకర్యానికి గురైతే క్షమించండి'..
# భక్తులకు మోదీ సందేశం

కుంభమేళా ముగింపును పురస్కరించుకొని ప్రధాని మోదీ ప్రజలకు సందేశమిచ్చారు.

భక్తులు ఎవరైనా అసౌకర్యానికి గురై ఉంటే క్షమించాలని కోరారు.

**బిల్లీ, ఫిబ్రవరి 27, (రిపబ్లిక్ న్యూస్):** ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక 'మహాకుంభమేళా' ఘనంగా ముగిసింది. 45 రోజుల పాటు సాగిన ఈ కుంభమేళా విశేషాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన బ్లాగ్లో రాశారు. ఇంత పెద్ద కార్యక్రమాన్ని నిర్వహించడం అంత సులువు కాదన్నారు. ఏర్పాట్ల విషయంలో భక్తులెవరైనా అసౌకర్యానికి గురైతే గనుక అందుకు క్షమించాలని కోరారు. "ఐక్యత కోసం జరిగిన మహాయజ్ఞం దిగ్విజయంగా ముగిసింది. భారతీయ ఐక్యతకు కుంభమేళా నిదర్శనంగా నిలిచింది. అంచనాలను మించి వివిధ ప్రాంతాల నుంచి కోట్లాది మంది భక్తులు తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు.

భారత్ కొత్త శక్తితో ముందుకుసాగుతోందని, నవ భారత్ను నిర్మించే కొత్త శకం వచ్చిందని చెప్పేందుకు ఇదే నిదర్శనం". "ఇంత గొప్ప కార్యక్రమాన్ని దేనితోనూ పోల్చలేం. త్రివేణి సంగమం నదీ తీరానికి అన్ని కోట్ల మంది ఎలా వచ్చారా? అని యావత్ ప్రపంచం ఆశ్చర్యపోతోంది. ఈ భక్తులెవరికీ అధికారిక ఆహ్వానాలు పంపలేదు. అయినా పవిత్ర సంగమంలో పుణ్యస్నానాల కోసం వారంతా తరలివచ్చారు. నదిలో స్నానమాచరించిన తర్వాత వారి ముఖాల్లో కన్పించిన సంతోషం, సంతృప్తి నేనెప్పటికీ మర్చిపోలేను. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు చాలామంది వ్యయప్రయాసలకోర్చి కుంభమేళాకు రావడం ఆనందంగా ఉంది" అని మోదీ రాసుకొచ్చారు. ఈసందర్భంగా మహాకుంభమేళాను విజయవంతం చేసిన యూపీ ప్రభుత్వం, సహకరించిన ప్రయాగ్రాజ్ ప్రజలు, భక్తులకు మోదీ ధన్యవాదాలు తెలిపారు. "ఇంతటి పెద్ద కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా నిర్వహించడం అనేది అంత సులువు కాదని తెలుసు. మా పూజల్లో ఏదైనా లోపం ఉంటే క్షమించాలని ఆ గంగా, యమునా, సరస్వతి మాతలను ప్రార్థిస్తున్నా: భగవంతుని స్వరూపాలుగా భావించే భక్తులకు సేవ చేయడంలో ఏదైనా లోపం ఉంటే అందుకు ప్రజలు కూడా క్షమించాలని కోరుతున్నా" అని మోదీ రాసుకొచ్చారు. జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు 45 రోజుల పాటు సాగిన మహా కుంభమేళాకు దేశ విదేశాల నుంచి భక్తులు పోటెత్తారు. సామాన్య పౌరులతో పాటు పలువురు రాజకీయ, సినీ రంగాలకు చెందిన ప్రముఖులు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఫిబ్రవరి 10, ప్రధాని మోదీ ఫిబ్రవరి 5న కుంభమేళాను సందర్శించి పుణ్యస్నానం చేశారు.

## ఈసీ ముందు నిరవధిక దీక్ష చేస్తా - మమతా బెనర్జీ

ఎన్నికల సంఘం సాయంతో ఇతర రాష్ట్రాల నుంచి నకిలీ ఓటర్లను తమ రాష్ట్ర జాబితాలో భాజపా చేర్చుతోందని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు.

**దిల్లీ, ఫిబ్రవరి 27, (రిపబ్లిక్ న్యూస్):** పశ్చిమ బెంగాల్ ఓటర్ల జాబితాలో అవకతవకలు జరుగుతున్నాయని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. ఎన్నికల సంఘం సాయంతో ఇతర రాష్ట్రాల నుంచి నకిలీ ఓటర్లను తమ రాష్ట్ర జాబితాలో భాజపా చేర్చుతోందని దుయ్యబట్టారు. వెంటనే దిద్దుబాటు చర్యలు తీసుకోకపోతే ఎన్నికల సంఘం కార్యాలయం ముందు నిరవధిక దీక్ష చేపడతానని హెచ్చరించారు.

తృణమూల్ కాంగ్రెస్ సమావేశంలో మాట్లాడిన దీదీ. భారత ఎన్నికల ప్రధాన కమిషనర్గా జ్ఞానేశ్ కుమార్ను నియమించడంపైనా ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సంఘాన్ని కూడా భాజపా ప్రభావితం చేస్తోందని ఆరోపించారు. 2006లో భూసేకరణ వ్యతిరేక ఆందోళనల క్రమంలో చేపట్టిన 26 రోజుల నిరాహార దీక్షను ఆమె గుర్తుచేశారు. ఓటర్ల జాబితాను సరిచేసి, తప్పుడు ఓటర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఈసీ కార్యాలయం ముందు దీక్ష చేపడతానని అన్నారు. ఎన్నికల ఫలితాలను తారుమారు చేసేందుకు హరియాణా, గుజరాత్ ఓటర్లను తమ రాష్ట్ర జాబితాలో చేర్చుతోందని మమతా బెనర్జీ ఆరోపించారు. ఢిల్లీ, మహారాష్ట్రల్లోనూ భాజపా ఈ తరహా వ్యూహాలను అమలు చేసిందన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తే విజయం సాధించలేమని భాజపాకు తెలుసునని, అందుకే తప్పుడు జాబితాను రూపొందించే పనిలో పడిందన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఇక్కడ రావని, బయట వ్యక్తులు (భాజపా) బెంగాల్ను స్వాధీనం చేసుకోవడాన్ని తాము అనుమతించబోమన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో 294 స్థానాలకు 215 చోట్ల విజయం సాధిస్తామని మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు.

## ముగిసిన వల్లభనేని వంశీ మూడు రోజుల కస్టడీ విచారణ

వైకాపా నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ పోలీసు కస్టడీ ముగిసింది.

**విజయవాడ, ఫిబ్రవరి 27, (రిపబ్లిక్ న్యూస్):** వైకాపా నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ పోలీసు కస్టడీ ముగిసింది. మూడు రోజుల కస్టడీకి కోర్టు అనుమతించడంతో కృష్ణలంక పీఎస్లో పటమట పోలీసులు ఆయన్ను విచారించిన సంగతి తెలిసిందే. చివరిరోజు విచారణ ముగిసిన అనంతరం వంశీని విజయవాడ జీజీహెచ్కు తరలించి వైద్యపరీక్షలు చేయించారు. కస్టడీలో వంశీతో పాటు మరో ఇద్దరు నిందితులు లక్ష్మీపతి, శివరామకృష్ణను పోలీసులు విచారించారు. సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో ప్రమేయం ఉన్నవారిపై ఆరా తీశారు. వంశీ చెబితేనే సత్యవర్ధనన్ను తీసుకెళ్లినట్లు మిగతా నిందితులు చెప్పినట్లు సమాచారం. తనకేమీ తెలియదని పోలీసుల విచారణలో వంశీ పదేపదే చెప్పినట్లు తెలిసింది. దీంతో మరోసారి ఆయన్ను కస్టడీకి తీసుకుని విచారించాలని భావిస్తున్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలు.. ఓటు హక్కు వినియోగించుకున్న చంద్రబాబు, లోకేశ్

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏపీ సీఎం చంద్రబాబు మంత్రి నారా లోకేష్ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

**అమరావతి, ఫిబ్రవరి 27, (రిపబ్లిక్ న్యూస్):** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల స్థానానికి నేడు ఎన్నికలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉండవల్లిలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రం వద్దకు చంద్రబాబు, లోకేశ్ చేరుకుని ఓటు వేశారు. ఈ ఎమ్మెల్సీ స్థానంలో మొత్తం 25 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరిలో ఆలపాటి రాజేంద్రప్రసాద్ (కూటమి) కేఎస్ లక్ష్మణరావు (పీడీఎఫ్) మధ్య ప్రధాన పోటీ నెలకొంది.

### ఓటు వేయడం మన బాధ్యత: చంద్రబాబు

ఎన్నికల్లో ఓటు వేయడం మన బాధ్యతని సీఎం చంద్రబాబు అన్నారు. ఉండవల్లిలో ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. "ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి. ప్రజాస్వామ్య దేశంలో ఓటు పెద్ద ఆయుధం. అందరూ బాధ్యతతో వేయాల్సిన అవసరముంది. ఓటు వేస్తేనే చైతన్యవంతమైన ప్రజాస్వామ్యానికి నాంది పలుకుతాం" అని చంద్రబాబు అన్నారు.

# తెలంగాణ రైజింగ్ను ఎవరూ ఆపలేరు: సీఎం రేవంత్ రెడ్డి

దేశంలోనే తెలంగాణ, హైదరాబాద్ నగరం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, (రిపబ్లిక్ న్యూస్):** దేశంలోనే తెలంగాణ, హైదరాబాద్ నగరం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం ఏడాదిలోనే దేశవిదేశాల నుంచి అత్యధిక పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. ఉద్యోగ కల్పనలో నంబర్వన్గా నిలిచామని చెప్పారు. ఈ విషయాన్ని గర్వంగా చెబుతున్నానన్నారు. హైదరాబాద్లోని మాదాపూర్లో హెచ్సీఎల్ టెక్ కొత్త క్యాంపస్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

"తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల జీడీపీ రాష్ట్రంగా మారుస్తానని నేను చెప్పినప్పుడు అది సాధ్యం కాదని కొందరన్నారు. రెండుసార్లు దావోస్ పర్యటనల్లో రూ.41,000 కోట్లు, రూ.1.78 లక్షల కోట్ల ఎంఓయూలపై సంతకాలు చేసుకున్న తరువాత ఇప్పుడు అది సాధ్యమని నమ్ముతున్నారు. తెలంగాణ రైజింగ్ను ఎవరూ ఆపలేరు. మా పోటీ ముంబయి, ఢిల్లీ, బెంగళూరు, చెన్నైతో కాదని నేను చెప్పినప్పుడు.. కొంతమంది అది పెద్ద కలనే అవుతుందన్నారు. ఈవీ అడాప్షన్లో హైదరాబాద్ను నంబర్ వన్గా చేసాక.. రాష్ట్రాన్ని డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ, లైఫ్ సైన్సెస్, బయో టెక్నాలజీ, స్కిల్స్, మ్యానుఫ్యాక్చరింగ్, అగ్రి ప్రాసెసింగ్ హబ్ మారుస్తున్నాం. ఇప్పుడు హైదరాబాద్ రైజింగ్ ఆగదు అని ప్రజలు అంటున్నారు. నేను మొదట తెలంగాణ, హైదరాబాద్ రైజింగ్ అని చెప్పినప్పుడు కొందరికి ఖచ్చితంగా తెలియదు.. ఇప్పుడు ప్రపంచం మొత్తం అంగీకరిస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద లైఫ్ సైన్సెస్ కంపెనీల్లో ఒకటైన అమెను ఇటీవలే ప్రారంభించాం. ప్రపంచంలోని అత్యుత్తమ సమావేశాల్లో ఒకటైన బయో ఆసియా సదస్సును నిర్వహించాం. గ్లోబల్ కంపెనీగా హెచ్సీఎల్ టెక్ దేశానికి గర్వకారణంగా నిలిచింది. ఇది 2.2 లక్షల మందికి పైగా ఉద్యోగులతో 60 దేశాల్లో ఆపరేట్ చేస్తోంది. డిజిటల్, ఇంజినీరింగ్, క్లౌడ్, ఏఐ రంగాల్లో వరల్డ్ క్లాస్ ఆఫరింగ్స్ క్రియేట్ చేస్తున్నారు. 2007లో హైదరాబాద్కు వచ్చినప్పటి నుంచి హెచ్సీఎల్ అంచలంచెలుగా పెద్ద స్థాయికి ఎదిగింది" అని రేవంత్రెడ్డి అన్నారు.

## ఏదైనా ప్రాజెక్టును అడ్డుకున్నట్లు సీఎం రేవంత్ నిరూపించాలి:కిషన్ రెడ్డి సవాల్

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చేసిన విమర్శలపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందించారు.

**దిల్లీ, ఫిబ్రవరి 27, (రిపబ్లిక్ న్యూస్):** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చేసిన విమర్శలపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. తాను ఏదైనా ప్రాజెక్టును అడ్డుకున్నట్లు నిరూపించాలని సవాల్ విసిరారు. హైదరాబాద్ మెట్రో రెండోదశ ప్రాజెక్టును కేంద్ర క్యాబినెట్ వద్దకు వెళ్లకుండా కిషన్రెడ్డి అడ్డుకున్నారని రేవంత్ బుధవారం వ్యాఖ్యానించారు.

**ఈ నేపథ్యంలో ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో కిషన్రెడ్డి మాట్లాడారు. "సీఎంగా ఉన్న వ్యక్తి అవగాహనా రాహిత్యంతో మాట్లాడుతున్నారు. రేవంత్రెడ్డి తెలంగాణకి సీఎం కావడం రాష్ట్ర ప్రజల దురదృష్టం. కేంద్ర ప్రభుత్వానికి ఒక విధానం ఉంటుంది.. దానికి అనుగుణంగానే వ్యవహరిస్తారు. రేవంత్ బ్లాక్మెయిల్ రాజకీయాలకు పాల్పడుతూ దుందుడుకుగా వ్యవహరిస్తున్నారు. కేంద్రం నుంచి డబ్బులు తెచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానని ఎన్నికల్లో చెప్పారా?" అని కిషన్రెడ్డి నిలదీశారు.**

### సీఎం రేవంత్ ఏమన్నారంటే..

"మెట్రో రెండోదశ ప్రాజెక్టును కేంద్ర క్యాబినెట్ వద్దకు వెళ్లకుండా కిషన్రెడ్డే అడ్డుకున్నారు. తన మిత్రుడు కేసీఆర్ పదేళ్లలో చేయని పని ఇప్పుడు చేస్తే రేవంత్రెడ్డికి పేరొస్తుందనే అలా చేశారు. నాకు రాష్ట్ర ప్రయోజనాల కంటే పేరు ముఖ్యం కాదు. కావాలంటే అనుమతులు, నిధులు తెప్పించి ఆ పేరును కిషన్ రెడ్డినే తెచ్చుకోమనండి. నేను కూడా ఆయన పేరే ఊరూరా ప్రచారం చేస్తా. సన్మానం చేసి గండపెండేరం తొడుగుతా. తెలంగాణ అభివృద్ధికి అవసరమైన 5 ప్రాజెక్టులకు సహకరించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీకి విన్నవించాం. వాటికి అనుమతులు, నిధులు తీసుకురావాల్సిన బాధ్యత కేంద్ర మంత్రులు కిషన్రెడ్డి, బండి సంజయ్లదే. లేకపోతే వారిద్దరూ గుజరాత్కు.. ఇంకో రాష్ట్రానికో వెళ్లిపోవాలి. తెలంగాణలో వారికి తిండి దండగ' అంటూ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

## ఓబులవారిపల్లె పీఎస్కు పోసాని
# కృష్ణమురళి.. అక్కడే వైద్యపరీక్షలు

వైకాపా నేత, సినీనటుడు పోసాని కృష్ణమురళిని పోలీసులు అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె పీఎస్ కు తీసుకొచ్చారు.

**ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 27, (రిపబ్లిక్ న్యూస్):** వైకాపా నేత, సినీనటుడు పోసాని కృష్ణమురళిని పోలీసులు అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె పీఎస్కు తీసుకొచ్చారు. హైదరాబాద్లోని రాయదుర్గంలో మైహోమ్ భూజాలో అదుపులోకి తీసుకున్న తర్వాత నేరుగా ఇక్కడికి తీసుకొచ్చారు. పోలీస్టే స్టేషన్లోనే ప్రభుత్వ వైద్యుడు గురుమహేశ్ ఆధ్వర్యంలో పోసానికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆయన స్టేట్మెంట్ను రైల్వేకోడూరు సీఐ వెంకటేశ్వర్లు నమోదు చేశారు. పోసాని కృష్ణమురళిని కాసేపట్లో రైల్వేకోడూరు కోర్టులో హాజరుపరిచే అవకాశముంది.

సినీ పరిశ్రమలో వర్గవిభేదాలు తలెత్తేలా, ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్పై పోసాని అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ జనసేన నేత జోగినేని మణి రెండు రోజుల క్రితం ఇచ్చిన ఫిర్యాదుపై ఓబులవారిపల్లె పోలీసుస్టేషన్లో కేసు నమోదైంది. వర్గాల మధ్య విభేదాలు రెచ్చగొట్టడం, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం, వ్యవస్థీకృత నేరానికి పాల్పడడం వంటి అభియోగాలపై బీఎన్ఎస్లోని 196, 353(2), 111 రెడ్విత్ 3(5) సెక్షన్ల కేసు నమోదైంది. దీనిలోనే పోలీసులు పోసానిని అరెస్టు చేశారు. వైకాపా హయాంలో నాటి ప్రభుత్వ పెద్దల అండదండలు, ఆదేశాలతో చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేశ్ సహా నాటి ప్రతిపక్షంలోని ముఖ్యులు, వారి కుటుంబాల్లోని మహిళలపై అసభ్య పదజాలం, బూతులతో పోసాని కృష్ణమురళి పేట్రేగిపోయారు.


printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- **1803:** ముంబాయి నగరంలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది.
- **1931:** భారతీయ స్వాతంత్ర్యోద్యమకారుడు చంద్రశేఖర్ అజాద్ మరణం (జ.1906). (చిత్రంలో)
- **1932:** ఆంగ్లో-అమెరికన్ నటి ఎలిజబెత్ టేలర్ జననం (మ.2011).
- **1932:** కవి, ఆర్థిక, వైద్య శాస్త్ర నిపుణుడు, బహుభాషావేత్త వేగె నాగేశ్వరరావు జననం (మ.1997).
- **1956:** లోక్‌సభ మొదటి స్పీకరు జి.వి.మావలాంకర్ మరణం (జ.1888).
- **1972:** తెలుగు సినిమా నటుడు శివాజీ రాజా జననం.
- **2002:** అహమ్మదాబాదు వెళుతున్న సబర్మతి ఎక్స్‌ప్రెస్ ఎస్-6 బోగిలో పెట్రోలు పోసి దహనం చేయడం వల్ల అయోధ్య నుంచి వస్తున్న 59 మంది విశ్వహిందూ పరిషత్తు కరసేవకులు మరణించారు.
- **2005:** తెలుగు సినిమా సంగీత దర్శకుడు, సుదీర్ఘకాలం మహదేవన్ సహాయకుడిగా పనిచేసిన పుహళేంది మరణం.

ముంబాయి


చంద్రశేఖర్ అజాద్

ఎలిజబెత్ టేలర్

జి.వి.మావలాంకర్

శివాజీ రాజా

సబర్మతి ఎక్స్‌ప్రెస్

పుహళేంది

రిపబ్లిక్ సోర్ట్స్ SPORTS

## న్యూజిలాండ్‌తో మ్యాచ్... ప్రాక్టీస్‌కు దూరంగా

# రోహిత్, శుభ్‌మన్!

ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ చివరి లీగ్ మ్యాచ్లో న్యూజిలాండ్‌తో తలపడనుంది.

ఛాంపియన్స్ ట్రోఫీలో వరుసగా రెండు మ్యాచ్లో విజయం సాధించిన టీమ్ ఇండియా సెమీస్‌కు దూసుకెళ్లింది. అదే ఊపును ఆదివారం (మార్చి 2) న్యూజిలాండ్ జరిగే చివరి లీగ్ మ్యాచ్లోను కొనసాగించాలనుకుంటోంది. ఈ మ్యాచ్ కోసం టీమ్ ఇండియా బుధవారం ప్రాక్టీస్ సెషన్నో పాల్గొంది. అయితే, కెప్టెన్ రోహిత్ శర్మ మాత్రం సాధనకు దూరంగా ఉన్నట్లు వార్తలొస్తున్నాయి. ఐసీసీ అకాడమీలో భారత ఆటగాళ్లు ఫుట్బాల్, రన్నింగ్ చేసి చెమటోడ్చుతుండగా, రోహిత్ మాత్రం కఠినమైన శారీరక కసరత్తులకు దూరంగా ఉన్నాడట. అతను స్ట్రెంత్ అండ్ కండిషనింగ్ కోచ్ సోహం దేశాయ్ పర్యవేక్షణలో మెల్లగా జాగింగ్ చేసినట్లు తెలుస్తోంది. కానీ, రోహిత్ స్వేచ్ఛగా కదలడం లేదని జాతీయ మీడియాలో వార్తలొస్తున్నాయి. భారత కెప్టెన్ ఎలాంటి త్రో డౌన్లు ఎదుర్కోకుండా కేవలం షాడో బ్యాటింగ్ చేస్తూ హెడ్ కోచ్ గంభీర్, ఇతర కోచింగ్ సిబ్బందితో చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. పాకిస్థాన్తో జరిగిన మ్యాచ్లో భారత కెప్టెన్ తొడ కండర గాయంతో బాధ పడ్డాడు. అయితే తాను బాగానే ఉన్నానని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పాక్ మ్యాచ్ అనంతరం చెప్పాడు.

### శుభ్‌మన్ గిల్ కూడా

ప్రస్తుతం సూపర్ ఫామ్లో ఉన్న శుభ్మన్ గిల్ కూడా ప్రాక్టీస్ సెషన్కు హాజరుకాలేదని సమాచారం. అతను హోటల్ రూమ్కే పరిమితమైనట్లు తెలుస్తోంది. బంగ్లాదేశ్తో జరిగిన మ్యాచ్లో సెంచరీ చేసిన గిల్ అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. రిషబ్ పంత్ జ్వరం నుంచి కోలుకొని బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశాడు. ఆటగాళ్ల ఫిట్నెస్ ఆందోళనల దృష్ట్యా న్యూజిలాండ్ జరిగే మ్యాచ్లో టీమిండియా తుది జట్టులో మార్పులు ఉండే అవకాశం ఉంది. కొంతమంది ఆటగాళ్లకు విశ్రాంతి ఇచ్చి ఇప్పటివరకు ఛాన్స్ రాని ప్లేయర్లను ప్లేయింగ్ ఎలెవన్ లోకి తీసుకోవచ్చు. టోర్నీలో మొదటి రెండు మ్యాచ్లో భారత్ ఒకే తుది జట్టుతో ఆడిన సంగతి తెలిసిందే.

## ‘కుబేర’ రిలీజ్ డేట్ వచ్చేసింది..
# ఆసక్తికర పోస్టర్ షేర్ చేసిన టీమ్

ధనుష్, రష్మిక ప్రధాన పాత్రలో రానున్న చిత్రం కుబేర్. ఈ సినిమా విడుదల తేదీని టీమ్ ప్రకటించింది.

వరుస సినిమాలతో జోష్ మీదున్న రష్మిక తాజాగా మరో సినిమాతో అలరించేందుకు సిద్ధమయ్యారు. అగ్ర హీరోలు నాగార్జున, ధనుష్లతో కలిసి ‘కుబేర’ అంటూ పలకరించనున్నారు. శేఖర్ కమ్ముల తెరకెక్కిస్తున్న ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ కానుంది. తాజాగా దీని విడుదల తేదీని తెలుపుతూ ఓ ఆసక్తికర పోస్టర్ను టీమ్ షేర్ చేసింది. జూన్ 20న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా పంచుకున్న పోస్టర్లో నాగార్జున, ధనుష్ ఎదురెదురుగా ఉండగా మధ్యలో బాలీవుడ్ నటుడు జిమ్ షర్బ్ కనిపిస్తున్నారు. ఇదొక భిన్నమైన సోషల్ డ్రామా కథాంశంతో తెరకెక్కుతున్నట్లు అర్థమవుతోంది. ఇందులో ధనుష్ ముందెన్నడూ చేయని కొత్త పాత్రలో కనిపించనున్నారు. రాజకీయాంశాలకూ ఇందులో పెద్దపీట వేసినట్లు తెలుస్తోంది. పైకి బిచ్చగాడిగా (ధనుష్) కనిపిస్తున్న వ్యక్తి ఎవరు? అతను ఎందుకు అలా మారాల్సి వచ్చింది? అతని నేపథ్యం ఏంటన్నది ఆసక్తికరంగా చూపించబోతున్నారు. నాగార్జున ఇందులో ఈడీ అధికారి పాత్ర పోషిస్తున్నట్లు టాక్. రష్మిక నటించిన వరుస సినిమాలు హిట్ అవుతున్న నేపథ్యంలో ‘కుబేర’పై అభిమానులు అంచనాలు పెట్టుకున్నారు. అగ్ర కథానాయకులు నటిస్తుండడం.. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో వస్తుండడంతో ఈ సినిమా కోసం ఆడియన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇందులో రష్మిక పాత్ర గురించి శేఖర్ కమ్ముల మాట్లాడుతూ.. “మీ పక్కంటి అమ్మాయిగా రష్మిక కనిపిస్తారు. ఇప్పటివరకూ రష్మిక, ధనుష్ కలిసి నటించడం చూడలేదు. ఇందులో వారి స్క్రీన్ ప్రజెన్స్ చాలా కొత్తగా ఉంటుంది” అని అన్నారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

## రజనీకాంత్ చిత్రంలో పూజా హెగ్డే..
# అధికారికంగా ప్రకటించిన టీమ్

రజనీకాంత్, లోకేశ్ కనగరాజన్ కాంబోలో తెరకెక్కుతున్న చిత్రం ‘కూలీ’. ఈ సినిమాలో పూజా హెగ్డే ఉన్నట్లు టీమ్ అధికారికంగా ప్రకటించింది.

రజనీకాంత్ కథానాయకుడిగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ ‘కూలీ’. నాగార్జున, శ్రుతిహాసన్, సత్యరాజ్, ఉపేంద్ర తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఆ సినిమాలో పూజా హెగ్డే నటించనున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఇందులో పూజా భాగం అయినట్లు టీమ్ తెలిపింది. ఈ చిత్రబృందం ఇటీవల ఓ ప్రీ లుక్ పోస్టర్ విడుదల చేసి ఈ స్టార్ హీరోయిన్ ఎవరో గుర్తుపట్టాలంటూ పోస్ట్ పెట్టింది. తాజాగా ఆ ప్రీ లుక్ పోస్టర్ పూజా హెగ్డేదేనంటూ కన్ఫార్మ్ చేసింది. అయితే పూజా ఇందులో కీలక పాత్రలో నటించనున్నారా, లేదంటే స్పెషల్ సాంగ్లో కనిపించనున్నారా అనేది తెలియాల్సి ఉంది. అనిరుధ్ ఈ సినిమాకు ‘జైలర్’ లోని “కావాలయ్యా” పాట తరహాలో ఓ ప్రత్యేక గీతాన్ని ప్లాన్ చేస్తున్నట్లు తెలిసింది. దీనికోసం పూజా హెగ్డేను ఎంపిక చేశారని అభిమానులు భావిస్తున్నారు. బంగారం స్మగ్లింగ్ అంశంతో ముడిపడి ఉన్న ఈ యాక్షన్ థ్రిల్లర్లో.. రజనీ మునుపెన్నడూ చూడని శక్తిమంతమైన పాత్రలో కనువిందు చేయనున్నారు. అమిరాఖాన్, నాగార్జున, ఉపేంద్ర, శ్రుతిహాసన్ తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా ఆగస్టులో థియేటర్లలోకి వచ్చే అవకాశముంది.

# పుట్టబోయే పిల్లల గురించి కూడా ఆలాంటి కామెంట్స్ చేస్తున్నారు: ప్రియమణి

వివాహం చేసుకున్నప్పటి నుంచి తనపై విమర్శలు వస్తూనే ఉన్నాయని నటి ప్రియమణి అన్నారు. పుట్టబోయే వారిపై కూడా కామెంట్స్ చేస్తున్నారంటూ అసహనం వ్యక్తం చేశారు.

యంగ్ హీరోయిన్లకు పోటీగా అగ్ర హీరోల సినిమాల్లో అవకాశాలు అందుకుంటున్నారు నటి ప్రియమణి. టాలీవుడ్, బాలీవుడ్లలో బిజీగా మారారు. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. వివాహం చేసుకున్నప్పటినుంచి కొందరు ప్రజలు తనను విమర్శించడమే లక్ష్యంగా పెట్టుకున్నారని అన్నారు. తనకు పుట్టబోయే పిల్లల గురించి కూడా కామెంట్స్ చేస్తున్నారని అసహనం వ్యక్తంచేశారు. 2017లో ముస్తఫారాజ్తో ప్రియమణి ఏడడుగులు వేసిన విషయం తెలిసిందే. 2016లో వీరి నిశ్చితార్థం జరిగిన నాటినుంచి ఆన్లైన్ వేదికగా విమర్శలు ఎదురవ్వడం ప్రారంభమయ్యాయని ప్రియమణి అన్నారు. “నాకు ఎంగేజ్మెంట్ జరగ్గానే నా మనుషులంతా ఆనందిస్తారని అనుకున్నాను. వారితో ఈ సంతోషకరమైన క్షణాలను పంచుకోవాలనుకున్నా. కానీ, అప్పటినుంచి నాపై అనవసరమైన ద్వేషం ప్రారంభమైంది. లవ్ జిహాద్ ఆరోపణలు వచ్చాయి. పిల్లలు పుట్టాక వారిని ఐసిస్ లో జాయిన్ చేస్తారా అంటూ కామెంట్స్ పెడుతున్నారు. అవి ఎంతగానో బాధ పెడుతున్నాయి. నేను మీడియా పర్సనన్ను కాబట్టి అలాంటివాటిని పట్టించుకోను. కానీ, నా భర్తపై అలాంటి కామెంట్స్ తో ఎందుకు దాడి చేస్తున్నారు. అతడి గురించి వివరాలు కూడా మీకు తెలియవు. కానీ, కామెంట్స్ మాత్రం చేసేస్తారు. ఇప్పటికీ కూడా నేను నా భర్తతో దిగిన ఫొటోను పోస్ట్ చేస్తే.. పదిలో తొమ్మిది కామెంట్స్ మా వివాహం మీదనే ఉంటాయి. వాటివల్ల బాధపడాల్సి వస్తోంది” అని ప్రియమణి అన్నారు. ఇక సినిమాల విషయానికొస్తే.. ఇటీవల ప్రియమణి ఆఫీసర్ ఆన్ డ్యూటీ సినిమాలో కనిపించారు. దళపతి విజయ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న జననాయగన్లో కీలకపాత్ర పోషిస్తున్నారు. ‘ది ఫ్యామిలీ మ్యాన్’లోనూ కనిపించనున్నారు.

## ఇంటి చిట్కాలు

# ఇప్పుడు చెప్పే కొన్ని టీలు తాగితే సిరల్లో పేరుకుపోయిన కొలెస్ట్రాల్ కరిగిపోతుంది, బరువు తగ్గడంతో పాటు గుండె కూడా పదిలం

**చెడు కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉంటే.. గుండె జబ్బులు, స్ట్రోక్, గుండెపోటు, హైపర్‌టెన్షన్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ఇక, అధిక బరువు కూడా అనేక ఆరోగ్య సమస్యల్ని తెచ్చి పెడుతుంది. అందుకే చెడు కొలెస్ట్రాల్‌తో పాటు బరువు కూడా తగ్గాలి.**

ఈ రోజుల్లో బిజీ లైఫ్‌స్టైల్, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్ల కారణంగా ఊబకాయం, కొలెస్ట్రాల్ సమస్యలు సర్వసాధారణం అయ్యాయి. శరీరంలో కొలెస్ట్రాల్ ఉండటం మంచిదే. అయితే.. ఆ కొలెస్ట్రాల్ ఎక్కువ అయితే శరీరానికి ముప్పు పొంచి ఉంటుంది. చెడు కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉంటే.. గుండె జబ్బులు, స్ట్రోక్, గుండెపోటు, హైపర్‌టెన్షన్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ఇక, అధిక బరువు కూడా అనేక ఆరోగ్య సమస్యల్ని తెచ్చి పెడుతుంది. అందుకే చెడు కొలెస్ట్రాల్‌తో పాటు బరువు కూడా తగ్గాలి. ఇక, కొన్ని ఇంటి చిట్కాలు బరువు తగ్గించడానికి సాయపడతాయి. ఈ ఇంటి చిట్కాల్లో హెర్బల్ టీలు కూడా ఉన్నాయి. ఐదు హెర్బల్ టీలు రోజూ తాగితే చెడు కొలెస్ట్రాల్ కరగడంతో పాటు బరువు కూడా తగ్గవచ్చు. ఆ చిట్కాలేంటో ఇక్కడ తెలుసుకుందాం.

### గ్రీన్ టీ

గ్రీన్ టీలో యాంటీ ఆక్సిడెంట్లు, పాలీ ఫెనాల్స్, యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ క్యాన్సర్ లక్షణాలు, కెటాచిన్లు ఉంటాయి. ఇవి జీవక్రియను పెంచుతాయి. అంతేకాకుండా శరీరంలో పేరుకుపోయిన చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సాయపడతాయి. రోజూ గ్రీన్ టీ తాగడం వల్ల బరువు తగ్గవచ్చంటున్నారు నిపుణులు. అదనంగా గ్రీన్ టీలో ఉండే ఎపిగాల్లోకెటాచిన్ గాలెట్ కొలెస్ట్రాల్‌ని తగ్గించడంలో సాయపడుతుంది.

### అల్లం టీ



అల్లంలో ఉండే జింజెరాల్, షోగోల్, జింజెరోన్ వంటి బయోయాక్టివ్ సమ్మేళనాలు.. శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్స్‌గా పనిచేస్తాయి. అల్లంలో యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ గుణాలు మెండుగా ఉంటాయి. అల్లంలో కార్బోహైడ్రేట్లు, ఫైబర్, విటమిన్ బీ3, బీ6, సీ, ఐరన్, పొటాషియం, మెగ్నీషియం, ఫాస్పరస్, జింక్, ఫొలేట్, నియాసిన్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. జింజెరాల్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. జీవక్రియను వేగవంతం చేస్తుంది. అల్లం బరువు తగ్గడానికి సాయపడే యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలను కలిగి ఉంటుంది. అల్లం టీ రోజూ తాగితే కొలెస్ట్రాల్ తగ్గడంతో పాటు బరువు కూడా తగ్గవచ్చంటున్నారు నిపుణులు.

### పుదీనా టీ

పుదీనా టీ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. కడుపులోని గ్యాస్ తగ్గించడానికి సాయపడుతుంది. పుదీనాలో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ గుణాలు ఉన్నాయి. ఇవి యూరినరీ ఇన్ఫెక్షన్ల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. ఈ టీ తాగడం వల్ల మూత్ర విసర్జనకు సంబంధించిన అన్ని సమస్యలు నయమవుతాయి. ఇక, పుదీనా టీ రోజూ తాగితే బరువు తగ్గవచ్చు. పుదీనాలో ఉండే యాంటీ ఆక్సిడెంట్ల కారణంగా కొలెస్ట్రాల్ తగ్గడంతో పాటు గుండె ఆరోగ్యానికి కూడా మేలు జరుగుతుంది.

### దాల్చిన చెక్క టీ

దాల్చిన చెక్కలో ఆరోగ్యానికి మేలు చేసే అనేక పోషకాలు ఉన్నాయి. దాల్చిన చెక్క టీ రక్తంలో చక్కెర స్థాయిల్ని నియంత్రించడంలో సాయపడుతుంది. ఇది జీవక్రియను పెంచుతుంది. బరువు తగ్గడంతో పాటు చెడు కొలెస్ట్రాల్ సమస్య కూడా నయమవుతుంది. ఇందుకోసం దాల్చిన చెక్కను పొడిలా చేసుకోండి. ఆ తర్వాత నీటిని తీసుకుని మరిగించి.. అందులో దాల్చిన చెక్క పొడిని కలపండి. ఆ తర్వాత ఫిల్టర్ చేసి గోరు వెచ్చగా తాగితే మంచి ఫలితం ఉంటుంది. ఈ టీని ఉదయాన్నే ఖాళీ కడుపుతో తాగితే మంచిది.

### తులసి టీ

తులసి టీలో అనేక రకాల విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. ఇవి శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సాయపడతాయి. తులసి టీ జీవక్రియను పెంచుతుంది. బరువు తగ్గడానికి సాయపడుతుంది. రోజూ తులసి టీ తాగితే కొలెస్ట్రాల్ కూడా తగ్గుతుంది. తులసి టీలో యాంటీ వైరల్ గుణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి జలుబు, దగ్గు, జ్వరం వంటి సీజనల్ వ్యాధుల్ని తగ్గించడంలో సాయపడతాయి.

### హెర్బల్ టీలతో ప్రయోజనాలు

- జీర్ణక్రియ మెరుగుపడుతుంది
- జీవక్రియ వేగవంతం అవుతుంది.
- యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి
- ఒత్తిడి తగ్గి మానసిక ఆరోగ్యం మెరగవుతుంది.
- నిద్రలేమి సమస్యలతో బాధపడేవారికి మంచి ఆప్షన్. రోజూ ఈ టీలు తాగడం వల్ల హాయిగా నిద్రపోవచ్చు.
- రోజుకు రెండు సార్లు ఈ టీల్లో ఏదైనా ఒకటి తాగితే శరీరానికి ఎంతో మేలు జరుగుతుంది. గర్భిణీ స్త్రీలు, ఇతర వ్యాధులతో బాధపడేవారు డాక్టర్‌ని సంప్రదించి సలహా తీసుకోవడం మంచిది.

**గమనిక**

ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వ్యక్తుల ఆరోగ్యాన్ని బట్టి ఫలితాలుంటాయి. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం. అలాగే, హెల్తీ లైఫ్ స్టైల్, సరైన ఆహారం కూడా తీసుకోవడం మీ ఆరోగ్యానికి ఎంతో మేలు.